

సాక్షి బాపట్ల

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శని వారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు.



మల్లాది వేంకటేశ్వరునికి పూజలు

అమరావతి: మల్లాది క్షేత్రంలోని శ్రీ వటవృ క్షాంతర్గత వేంకటేశ్వరస్వామి వారికి శని వారం ప్రత్యేకపూజలు, ఘనంగా శాంతి కళ్యాణం నిర్వహించారు.



జగత్ప్రసూతికగా శ్రీశారదాంబ

నరసరావుపేటఈస్ట్: శ్రీ శృంగేరి శంకర మఠంలోని శ్రీ శారదాంబ అమ్మవారి ఆల యంలో అమ్మవారు శనివారం జగత్ప్రసూ తిక అలంకారంలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

ఎండోమెంట్ ఈఓ జ్యోతి సస్పెన్షన్



యద్దనపూడి: నిధులు దుర్వినియోగం చేసినం దుకు దేవదాయశాఖ ఈఓపై వేటు పడింది. పూనూరు యనమదల గ్రూపు దేవస్థానాల పూర్వపు ఈఓగా బాధ్య తలు నిర్వహించిన ఈఓ జ్యోతికుమారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం కారంచేడు గ్రూపు దేవస్థానాల ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. వగతంలో యద్దనపూడి మండలంలోని పూనూరు, యనమదల గ్రూపు ఈఓగా జ్యోతికుమారి పనిచేసిన కాలంలో రూ.25 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావటంతో ఆమెను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. భూముల కౌలు వసూళ్లలో నిర్లక్ష్యం గా ఉండటమే కాక వసూలైన నగదును సకా లంలో బ్యాంకులో జమ చేయకుండా బడ్జెట్‌కు మించి ఖర్చు చేసినట్లు ఆరోపణలు వచ్చా యన్నారు. ఈ మేరకు ఆమెపై విచారణ చేపట్ట నున్నట్లు డీసీ తెలిపారు.

సుస్థిర నగరాల జాబితాలో గుంటూరు

నెహ్రూనగర్: సుస్థిర నగరాల జాబితాలో గుం టూరు, విజయవాడ నగరపాలక సంస్థలు చోటు దక్కించుకున్నాయి. యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(యూనిడో), స్వచ్ఛ భారత్ మిషన్, అర్బన్ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ సంయుక్తంగా ఢిల్లీలో రెండు రోజులపాటు ఇం డియా ఫోరం సమావేశం నిర్వహించింది. ఇం దులో భాగంగా వ్యర్థాల నిర్వహణ, వనరుల పునరుద్ధరణ, సామర్థ్యాన్ని పెంపొందించడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పన వంటి కార్యక్రమాలు మరింతగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా గ్లోబల్ ఎని వ్యరాన్‌మెంట్ ఫెసిలిటీ నిధులతో ప్రాజెక్ట్ అమలు చేస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సుస్థిర నగరాలుగా దేశంలోని భోపాల్, గుం టూరు, జైపూర్, మైసూర్, విజయవాడ నగరా లను ఎంపిక చేశారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు



అమరావతి: అమరా వతిలోని బాలచాముం డిక సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు శ్రీ దేవీ శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి నాథ శర్మ తెలిపారు. కార్యక్రమ వివరాలను ఆయన శనివారం వెల్లడించారు. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఏకాదశి వరకు బాలచా ముండేశ్వరి, జ్వాలాముఖి అమ్మవార్లకు ప్రతి నిత్యం మూడు వేళల సహస్రకుంకుమార్చన, దేవీఖడ్గమాల, లలితా అష్టోత్తరనామార్చన, సప్తశతి పారాయణం, ప్రతి రోజూ చండీ హోమం నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి తొమ్మిది అలంకా రాలు చేస్తామన్నారు. ఉత్సవాలలో భాగంగా అక్టోబరు 22న స్వామివారికి చండీ కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అంకురారోపణ, వాస్తుహోమం, పుణ్యాహవచనం, ధ్వజ పటారోహణ రాత్రి ఏడు గంటలకు చండీ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్టోబరు 23వ తేదీ రాత్రి ఆరు గంటలకు పారువేట, ఎనిమిది గంటలకు శమీపూజ నిర్వహిస్తామన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 527.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎడమ కాలు వకు 5,948, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 26,950, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 848.80 అడుగుల వద్ద ఉంది.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా
- కొండుబొట్లవారిపాలెంలో స్మృతి వనం ప్రారంభం
- హాజరైన శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే రఘుపతి
- ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు



స్మృతి వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా, పక్కన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

బాపట్లఅర్బన్: మహిళ పక్షపాతిగా రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగి స్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. మండల పరి ధిలోని కొండుబొట్లవారిపాలెంలోని ఉమ్మారెడ్డి వెంకయ్య, కోటమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన లక్ష్మీసమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం మొక్కలు నాటి వెంకయ్య, కోటమ్మల స్మృతి వనాన్ని ప్రారంభించారు. జాతీయ రహదారి వద్ద నుంచే మంత్రి రోజాకు గ్రామ స్తులు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ.. బాణసంచా, మంగళ వాయిద్యా లతో గ్రామస్తులు పెద్దఎత్తున ప్రదర్శనగా మం త్రిని దేవస్థానం వరకు తీసుకువెళ్లారు. సంప్ర దాయబద్ధంగా పూర్ణకుంభంతో మంత్రి రోజాకు స్వాగతం పలికారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి రోజా మాట్లాడుతూ టీటీడీ ద్వారా రాష్ట్రంలో 1,800 దేవాలయాలను ప్రభుత్వం నిర్మిస్తుంద న్నారు. దేవస్థానాలను ప్రభుత్వం పరిరక్షిస్తుం దని వివరించారు. ముఖ్యంగా పేదరికంతో బాధపడుతున్న అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారి వేతనాలను పెంచింద న్నారు. మహిళలను గౌరవించిన చోటనే అభి వృద్ధి ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయగా నాలుగు సంవత్సరాల ముందు గానే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏపీలో మహిళలకు అధిక రిజర్వేషన్లు కల్పించారన్నారు. గ్రామ ప్రజల ప్రేమ, అభిమానం, దేవుడి ఆశీస్సులు నాకెంతో ఆనందాన్ని కలిగించాయని తెలిపారు. విజయవాడలో 20 దేవాలయాలను గత ప్రభుత్వం తొలగిస్తే ప్రస్తుతం జగన్ పాలనలో ఆ దేవాలయాలన్నింటిని పునఃనిర్మిస్తున్నట్లు వివరించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన తల్లి కోరికను తీర్చడానికి దిగ్విజయంగా దేవ స్థానాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. గణపతి దేవుడు, లక్ష్మీదేవిల ఆశీస్సులు గ్రామ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అన్ని సదుపా యాలతో దేవస్థానాన్ని నిర్మించినట్లు శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలి పారు. దేవాలయాన్ని ప్రారంభించిన నాటి నుం చి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదని గ్రామ ప్రజలంతా సంతోషంతో అభివృద్ధి వైపు అడు గులు వేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా గ్రామంలోని మహిళలంతా ప్రతి రోజు పూజలు, వ్రతాలతో దైవధ్యానంలో ఉంటు న్నారని తెలిపారు. దేవాలయం నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషదాయ కమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. విగ్నేశ్వరుడు ఆలయంలో నిత్యం పూజలు జరి గేలా స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో మేలు అన్నారు. పండుగ వాతావరణంలో వేడుకలు జరగడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్.శ్రీ ధర్, డీఈవో పీ.వీ.రామారావు, పర్యాటక శాఖ అధికారి పి.సురేష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, అధికారులు, ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శని వారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,300 వరకు పలికింది.

భారత్ విజయంతో యువత సంబరాలు

ఎల్‌ఈడీ స్క్రీన్‌పై భారత్–పాక్ మ్యాచ్ తిలకించిన అభిమానులు



మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు

చీరాల రూరల్: క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా భారత్–పాకిస్తాన్‌ల మధ్య హైవోల్టేజీ మ్యాచ్‌ను యువత, చిన్నారులు ఉత్సాహంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌పై శనివారం వీక్షించారు. రెండు దేశాలు ఎక్కడ పోటీపడినా ఇరుదేశాల క్రికెట్ అభిమా నులకు పంట పండినట్లే. ఎన్ని పనులున్నా సరే టీవీలకు అతుక్కుపోయి మ్యాచ్ ముగిసేంత వరకు చూస్తారు. చీరాలలో క్రికెట్ అభిమానుల కోసం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ స్థానిక ఓపెన్ ఎయిర్ థియేట ర్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులందరూ ఒకేచోట కూర్చొని మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేపట్టారు. మ్యాచ్ ప్రారంభం నుంచి విజయం సాధించేంత వరకు అభిమానులు కేరింతలు కొడుతూ తిలకిం చారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జర గకుండా ఉండేందుకుగాను పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కెప్టెన్ రోహిత్‌శర్మ సిక్సర్లు కొడుతుంటే యువత కేరింతలు కొట్టారు. మొత్తం మీద క్రికెట్ అభిమానుల కోసం ఎల్ ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసిన కరణం వెంకటేష్ క్రీడాభిమానుల అభిమానాన్ని చూరగొన్నారు. అందుకు కరణం వెంకటేష్‌కు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు క్రికెట్ అభిమానులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్య క్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన ఐజీ, ఎస్పీలు



గుంటూరులోని పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో రెండు రోజు లపాటు నిర్వహించే ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్షలు శనివారం ప్రశాంతం గా ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా పరిధిలో 14 పరీక్ష కేంద్రా లను ఏర్పాటు చేయగా, 7,145 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లను జారీ చేసిన విషయం విదితమే. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉదయాన్నే టీజేపీఎస్ కళాశాల, ఏసీ కళాశాల, ఆర్‌వీఆర్/జేసీ కళాశాల, విజ్ఞాన్ నిరులా/డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్పీలు కె.ఆరిఫ్‌హఫీజ్ (గుంటూరు), వకుల్ జిందాల్ (బాపట్ల), వై.రవిశంకర్‌రెడ్డి (పల్నాడు), ఎస్ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పలు కేం ద్రాలను పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాలలో ఎంత మంది అభ్య ర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు, లోపలికి వచ్చే వేళల్లో తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు ఐజీ పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు కల్పించిన మౌలిక సదు పాయాలపై ఆరాతీశారు. బయోమెట్రిక్, ఫొటోగ్రాఫ్‌లను కూలంకుషం గా పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎస్ఐ అభ్యర్థుల మెయిన్స్ రాత పరీక్షలు ప్రారంభమైనట్లు చెప్పారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరిని బయోమెట్రిక్‌తో కూలంకుషంగా పరి శీలించి, తదుపరి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించినట్లు తెలిపారు. అభ్య ర్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు జాగ్రత్తలు, పహారా నిర్వహించడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏఎ స్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), మహేష్ (బాపట్ల), ఎ.శ్రీ నివాసరావు (క్రైం), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి, బాలసుందరరావు, రేంజ్‌లోని పలువురు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, బీడీ బృ ందాలు బందోబస్తు నిర్వహించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- ఇద్దరు పత్తి వ్యాపారులు
- మార్టూరు వద్ద ఘటన
- గుంటూరుకు చెందిన వారుగా గుర్తింపు


మున్నంగి బ్రహ్మారెడ్డి


మల్లికార్జునరెడ్డి

మార్టూరు: జాతీయ రహదారి రక్తమోడింది.. చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలవుతున్నా యి. వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అందులో ఇద్దరు పత్తి వ్యాపారులు మృతిచెందారు. ఎస్ఐ కమలాకర్ అందించిన వివరాలు.. గుంటూరు శ్యామలానగర్‌కు చెందిన మున్నంగి బ్రహ్మారెడ్డి(62), రైలుపేటకు చెందిన చింతా మల్లికార్జునరెడ్డి(50) ఇద్దరూ కలిసి పత్తి వ్యాపారం చేస్తుంటారు. వీరు తమకు రావాల్సిన నగదు వసూలు నిమిత్తం వారం రోజుల క్రితం నెల్లూరు వెళ్లి శుక్రవారం రాత్రి గుంటూరుకు కారులో తిరిగి ప్రయాణమయ్యారు. స్థానిక సుధా లారీ కాటా సమీపంలో వీరు తమ ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రహదారి పక్కన ఆగి ఉన్న బాతుల లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం మొత్తం ధ్వంసమై ముందు ఉన్న లారీ కిందకు దూరి వెళ్లిపోయింది. ప్రమాదంలో కారు ముందు సీటులో ఉన్న బ్రహ్మారెడ్డి, మల్లికార్జునరెడ్డి శరీర భాగాలు ఛిద్రమై అలాగే ఉండిపోయాయి. దీంతో స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది నాగేశ్వరమ్మ, ఎస్ఐ ప్రమాదస్థలికి చేరకొని గునపాలతో కారును లారీ నుంచి వెలుపలకు లాగి డోర్లు పగులగొట్టి క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చారు. పరీక్షించిన 108 సిబ్బంది అప్పటికే వారు మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కారు డోర్లను గునపాలతో తెరిచేందుకు ప్రయత్నిస్తున్న ఎస్ఐ కమలాకర్

పి.గుడిపాడు వద్ద డ్రైవర్..

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున కొరిశపాడు మండలం పీ గుడిపాడు వద్ద చోటు చేసుకుంది. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డి అందించిన వివరాలు.. విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపునకు వెళ్తున్న లారీ డ్రైవర్ పీ గుడిపాడు సమీపానికి రాగానే బహిర్భూమికి వెళ్లేందుకు లారీని పక్కన ఆపాడు. కాలకృత్యాలు ముగించుకొని తిరిగి తన లారీ వద్దకు వచ్చే క్రమంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం డ్రైవర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పేరు అలోక్‌పాల్(25) ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కుద్వాల్ గ్రామం కాన్పూర్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మార్టూరు వాసి మృతి



యద్దనపూడి: బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిన వ్యక్తిపై లారీ దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన యద్దనపూడి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ చిరుకొండ వెంకటేశ్వరరావు మంగళగిరిలో తన వ్యక్తిగత పనుల్ని ముగించుకుని బైక్‌పై వస్తుండగా యద్దనపూడి మండలం తిమ్మాపురం హైవే జంక్షన్‌లో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. అదేమార్గంలో వెనుక నుంచి వస్తున్న లారీ అతడిపై నుంచి వెళ్లింది. దీంతో కొంతదూరం మేర ఈడ్చుకు పోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని అంబులెన్స్‌లో వెంకటేశ్వరరావును గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య బాలసరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

సత్యసాయి సేవా సమితి సేవలు నిరుపమానం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- రూ.10 లక్షల విరాళం

పిట్టలవానిపాలెం: శ్రీసత్యసాయి సేవాసమితి సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెంలో సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీవీ పాలెంలో రూ.కోట్ల నిధులతో వైద్యశాలను నిర్మించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి గ్రామ సచివాలయంలో ఒక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు ఈప్రాంతంలో సత్యసాయి సేవాసమితి వారి సేవలు కేడా అవసరమేనన్నారు. అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా అందించడం చాలా సంతోషించదగిన విషయమన్నారు. సేవా సమితి వారు నిర్వహించే సేవలో తనవంతు సాయంగా రూ.10 లక్షలు అందిస్తానని తెలిపారు. శ్రీసత్యసాయిబాబా వారి ఆశీస్సులు బాపట్ల నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని కోరారు. తొలుత వైద్యశాల ఆవరణలో ఉచిత అంబులెన్సును ప్రారంభించారు. కార్యక్రమంలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.నరసరాజు, కరుణరాజు, కిషోర్‌రాజు, శ్రీనివాసరాజు, గోకరాజు మూర్తిరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు, మంతెన గంగరాజు పాల్గొన్నారు.


ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన

సాంకేతిక లోపంతో నెమ్మదిగా నడిచిన రైళ్లు

చినగంజాం: సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తడంతో చినగంజాం రైల్వే స్టేషన్ పరిధిలో శనివారం రైళ్లు మూడు గంటల పాటు నెమ్మదిగా నడిచాయి. రైల్వే గేటు నంబర్ 229, 230, 231 నంబర్ల రైల్వే గేటుల మధ్య సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం చోటుచేసుకుంది. దీంతో శనివారం మధ్యాహ్నం 12 గంటలు నుంచి 3 గంటల వరకు పలు రైళ్లకు ఆయా గేట్‌మన్‌లు జెండాలు ఊపి రైళ్లను నెమ్మదిగా పంపించారు. దీంతో సుమారు 3 గంటలు పాటు ఈ లైనులో వెళ్లే రైళ్లు నెమ్మదిగా నడిచాయి.

బౌద్ధ భారతంతోనే సమ సమాజ స్థాపన సాధ్యం

బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేకే బోధి

భట్టిప్రోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు కన్న బౌద్ధ భారతంతోనే సమ సమాజ స్థాపన సాధ్య పడుతుందని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ)రాష్ట్ర ఉపాధ్యక్షులు కేకే బోధి అన్నారు. అంబేడ్కర్, అక్టోబర్ 14వ తేదీ నాటికి బౌద్ధ ధర్మ దీక్ష తీసుకుని 67 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీఎస్ఐ ఆధ్వర్యంలో భట్టిప్రోలు బౌద్ధ స్థూపం ఆవరణలో శనివారం గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలు, ధర్మ అశోక చక్రాన్ని ఉంచి బీఎస్ఐ నిర్వాహకులు, అంబేడ్కర్ వాదులు బౌద్ధ సంస్కృతి సంప్రదాయాలతో కార్యక్రమాలను నిర్వహించారు. కేకే బోధి మాట్లాడుతూ అంబేడ్కర్ బౌద్ధాన్ని 6 లక్షల మందితో బౌద్ధ ధర్మ దీక్ష స్వీకరించి ప్రత్యామ్నా య సంస్కృతికి పునాదులు వేశారని తెలిపారు. బుద్ధ వందనం, పంచశీల బౌద్ధ సంస్కృతి సంప్రదాయాలను ఆలపించారు. గ్రామ సర్పంచి దారా రవికిరణ్మయి చెన్నయ్య మాట్లాడుతూ స్త్రీ సమానత్వాన్ని ప్రబోధించినది బౌద్ధం మాత్రమేనని కొనియాడారు. భట్టిప్రోలు ప్రాంతాన్ని బౌద్ధ పర్యటనకు ప్రభుత్వాలు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు దారం సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్‌కుమార్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు అంది శ్యామ్, జై భీమ్ భారత పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ, గుండాల సునీల్, పేర్ల మోజస్‌బాబు, పంతగాని నాగేశ్వరావు, చెరుకూరి లక్ష్మణరావు, జడా రవీంద్రబాబు, ఎస్.కార్తీక్, దాసరి వెంకటేశ్వరరావు, జి.ప్రకాశరావు పాల్గొన్నారు.

అవినీతి కేసుల్లో జైలుకెళ్లి దీక్షలా !

ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల: స్కిల్ స్కాంలో చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపించారంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. శనివారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అవినీతి కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన టీడీపీ అధినేత చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిందన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, అవినీతి కేసులో జైలుకు వెళితే అక్రమంగా అరెస్ట్ చేయించారంటూ ఆయన తనయుడు నారా లోకేష్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ధర్మపోరాట దీక్షలు, అక్రమ కేసుల్లో ఇరికించారంటూ టీడీపీ నేతల మాటలు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. అరెస్టు అయిన రోజు నుంచి నేటి వరకు అబద్ధపు మాటలతో చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు ప్రజల్లోకి వెళ్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూడలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అందించి ప్రజల మన్నన పొందారన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని చెప్పారు.

హెల్మెట్ లేకుండా బైక్‌లు నడిపితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లాలో నో యాక్సిడెంట్ డే శనివారం నిర్వహించారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కోరారు. వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని చెప్పారు.